క్లుప్తంగా

భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు

హాలియా : వినాయక నిమజ్జనంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. హాలియా పరిధిలోని అలీనగర్ (14వ మైలు రాయి) సాగర్ ఎడమ కాల్వ వద్ద నిమజ్జనం జరిగే స్థలాన్ని గురువారం ఆమె, ఎస్పీ శరత్ చంద్రపవార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 5న నిర్వహించే గణేష్ నిమజ్జనానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. క్రేన్లు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, లైటింగ్, తాగునీరు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వారి వెంట అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ శివరాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ సాయి ప్రశాంత్, ఎంపీడీఓ సుజాత, వివిధ శాఖల అధికారులున్నారు.

ఇంజనీర్స్ సర్వీస్ ప్యానెల్ విజయం

మిర్యాలగూడ : తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ వైటీపీఎస్ బ్రాంచ్ గురువారం నిర్వహించిన ఎన్నికల్లో ఇంజనీర్స్ సర్వీస్ ప్యానెల్ ఘన విజయం సాధించింది. 150 మంది ఏఈలు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. బ్రాంచ్ సెక్రటరీగా బి.శ్రీకాంత్, బ్రాంచ్ కోశాధికారిగా ఎస్.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.రవి, జోనల్ సెక్రటరీగా ఎం.కరుణాకర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. వీరిని అసోసియేషన్ రాష్ట్ర నాయకులు చామల దత్తుకుమార్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అసిస్టెంట్ ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వైటీపీఎస్ అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని అన్నారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన ఉండాలి

హాలియా : రేబిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హాలియా మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో వీధి కుక్కల నియంత్రణ, రేబిస్ వ్యాధిపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రేబీస్ వ్యాధి ప్రాణాంతకమని కుక్కల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

నేత్ర దానంపై అవగాహన పెంచుకోవాలి

మిర్యాలగూడ అర్బన్ : ప్రతి ఒక్కరూ నేత్ర దానంపై అవగాహన పెంచుకోవాలని ఆర్గాన్ డొనేషన్ చైర్మన్ మిట్టపల్లి విజయభాస్కరరావు అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని షాబూనగర్‌కు చెందిన నల్లగంతుల లింగమ్మ గురువారం మృతిచెందడంతో వాసవి క్లబ్ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న విజయభాస్కరరావు లింగమ్మ కుటుంబ సభ్యుల అనుమతితో ఆమె నేత్రాలను డైమాండ్ నేత్ర నిధి ద్వారా సేకరించి హైదరాబాద్‌లోని అగర్వాల్ ఐ ఆస్పత్రికి అందజేసినట్లు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యురాలు గుడిపాటి అనిత, నేత్ర నిధి టెక్నీషియన్ బచ్చలకూరి రమేశ్ ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నిడమనూరు : క్రీడలతో మానసికోల్లాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని మండల విద్యాధికారి ఎల్ వెంకన్న అన్నారు. నిడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండలస్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకన్న మాట్లాడుతూ వాలీబాల్ అండర్-17 బాలురు ప్రథమ ఎర్రబెల్లి, ద్వితీయ ముకుందాపు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. కబడ్డీ (బాలుర) ప్రథమ ఆదర్శ పాఠశాల, ఖోఖో ఆదర్శ పాఠశాల నిడమనూరు, ఖోఖో ద్వితీయ తుమ్మడం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం గౌతమ్, లయన్స్ క్లబ్ కార్యదర్శి అశోక్, క్లబ్ జిల్లా సభ్యుడు పాంపాటి శ్రీనివాసులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మాడుగులపల్లి : మండలంలోని అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సబ్బు హరికృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు మంద్రగిరి యాదవ్‌లు అన్నారు. గురువారం మండలంలోని పాములపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల కోసం స్థానిక అధికారులు, నాయకులతో కలిసి వారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తీగల సతీష్, రావు వెంకట్‌రెడ్డి యాతం కళింగరెడ్డి, ఉపేందర్, లక్ష్మీనర్సు ఉన్నారు.

నిధులు దుర్వినియోగం చేయొద్దు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రాజీవ్‌గాంధీ స్టేడియానికి ప్రభుత్వ నుంచి వచ్చే నిధులను దుర్వినియోగం చేయొద్దని, యంగ్ క్రికెటర్స్ అధ్యక్షులు శ్రీనివాస్, క్రీడాకారులు అతీఖ్, జానీ, రవి అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరారు. స్టేడియంలో పలు భవనాలు, ఇండోర్ స్టేడియం వచ్చే ఆదాయం గ్రౌండ్ అభివృద్ధికి ఖర్చు చేయాలని అన్నారు. అదే విధంగా గ్రౌండ్‌లో మౌలికవసతులు కూడా కల్పించాలన్నారు.

ఉపాధ్యాయులు.. విద్యా దీపికలు

ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులను చైతన్యపరుస్తూ, విద్యార్థులను పాఠశాలలకు రప్పిస్తూ , డిజిటల్, వినూత్న పద్ధతుల్లో బోధిస్తూ మూతబడిని బడులను తెరిపిస్తూ.. పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నా ఉపాధ్యాయులు నిజమైన విద్యాదీపికలుగా నిలుస్తున్నారు.


వెనిగండ్ల పాఠశాలలో ఉపాధ్యాయుడు రుక్మారెడ్డి దాతల సహకారంతో వేసిన చిత్రాలు


ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన నిడమనూరు ప్రాథమిక పాఠశాల ప్రవేశ ద్వారం

నిడమనూరు : ప్రాథమిక పాఠశాలలో ఏఐ ఆధారిత విద్యనందిస్తూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ దీటుగా నిడమనూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కర్నాటి శ్రీనుకుమార్ కృషి చేస్తున్నారు. పిల్లల అభ్యసన సామార్థ్యాలను గుర్తించి, వారికి అనుగుణంగా ఫౌండేషనల్, లిటరసీ, న్యూమరసి లుగా మూడు గ్రూప్‌లుగా విభజించి బోధన, అభ్యసనా పద్ధతి ద్వారా విద్యార్థులను ఆడుతూ, పాడుతూ, అభ్యసనా సామగ్రి ద్వారా తరగతి గదిలో విద్యార్థులకు అందుబాటులో ఉంచుతూ...విద్యార్థి స్వతహాగా నేర్చుకొనే విధానంలో జ్ఞాన సమపార్జన విధానంలో పుస్తక పఠనం, ఆటల, పాటల ద్వారా విద్యనందిస్తూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ప్రతి పాఠాన్ని విద్యార్థికీ ఎంత నేర్చుకున్నాడని కూడా పరిశీలిస్తున్నారు. విద్యార్థి చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాలు నేర్పడం, ఆటలు, పాఠాల్లో పిల్లలను గుర్తించి ప్రొత్సహిస్తున్నారు. టీ శాట్ పాఠాలు, అభ్యసనా పరికరాలు ఉపయోగిస్తూ బోధన చేయడం యూట్యూబ్ ద్వారా పాఠాలు, ఆట పాఠాలు బోధన చేస్తున్నారు.

రంగు రంగు చిత్రాలతో..

మండలంలోని వెనిగండ్ల పాఠశాలకు దాతలు, సహచర ఉపాధ్యాయుల సహకారంతో టీచర్ రుక్మారెడ్డి పాఠశాల గోడలపై రంగు, రంగుల చిత్రాలు, బోధనకు ఉపాయోగపడేలా త్వరితగతిన విద్యార్థులు వినూత్నంగా వేగంగా విద్యనభ్యసించేలా వర్ణమాల, పదబంధాలు, జాతీయ నాయకుల చిత్రాలతో తరగతి గదిని విద్యకు ఆలయంగా తీర్చిదిద్దారు. పాఠశాలకు మౌలిక సౌకర్యాలలో కల్పనలో భాగంగా 40 అంగుళాల కలర్ టీవీ, ఫ్యాన్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. గతేడాది 30 విద్యార్థుల ఉన్న పాఠశాల నేడు 54 మంది విద్యార్థులు చేరారు. అంతేగాకుండా రుక్మారెడ్డి సార్ ఎక్కడ పనిచేసిన 90 శాతం మంది విద్యార్థులు గురుకుల, నవోదయ పాఠశాలకు ఎంపిక అవుతున్నారు.

వాట్సప్ గ్రూప్ ఏర్పాటుచేసి..


పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్చాలని తల్లిని కోరుతున్న ఉపాధ్యాయుడు వేణుధర్

మిర్యాలగూడ టౌన్: ఓ వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధనపై నమ్మకం కలిగించి మూత బడిని బడిని మళ్లీ తెరిపించాడు ఓ ఉపాధ్యాయుడు. మిర్యాలగూడ మండలం రుద్రారం గ్రామ పంచాయతీలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన సుంకరి వేణుధర్. గతేడాది ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండడంతో ఆ పిల్లలను కిష్టపురం ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. బదిలీపై వచ్చిన వేణుధర్ ఆ ఇద్దరు పిల్లలతో పాటు ఇంకో విద్యార్థిని చేర్పించి మూత బడిని పాఠశాలను తెర్పించారు. ఆ తరువాత ప్రతి రోజు ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 'ఈ ఒక్క అవకాశం ఇవ్వండి.. విద్యార్థుల చదువుల్లో మార్పులు రాకుంటే మీ ఇష్టం' అని వారిలో చైతన్యం తీసుకొచ్చాడు. అలాగే 'రుద్రారం గ్రామం' వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి విద్యాబోధనపై పూర్తి స్థాయిలో వివరించి తల్లిదండ్రులను చైతన్యం చేశాడు. దీంతో ఒక్క నెలరోజుల్లోనే 18మంది పిల్లలను బడిలో చేర్పించి పాఠశాలను తెరిపించారు. అయితే పిల్లలు 18 మంది వరకు ఉండటంతో ఈ పాఠశాలకు మరో ఉపాధ్యాయురాలిని ఎంఈఓ డిప్యూటేషన్‌పై పంపించాడు.

మూతబడిన పాఠశాలను తెరిపించి

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కొర్రానితండా ప్రాథమిక పాఠశాల ఐదేళ్ల కింత మూతబడింది. కాని 2025–26 విద్యా సంవత్సరానికి గాను మండల విద్యాధికారి ఆర్.నాగేశ్వర్‌రావునాయక్, చింతకుంట్ల కాంప్లెక్స్ హెచ్‌ఎం సంజీవ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని కొర్రానితండా గ్రామస్తులతో మాట్లాడి ఆ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను 10 మంది విద్యార్థులతో పునఃప్రారంభించారు. ఆ పాఠశాలకు వెంకటేశ్వర్లు అనే ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై పంపించి ప్రతి రోజూ గ్రామంలో తిరుగుతూ విద్యార్థులు పాఠశాలకు వచ్చే విధంగా తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలకు వచ్చేలా కృషి చేశారు. ఈ పాఠశాలను పునఃప్రారంభించడానికి ప్రత్యేక శ్రద్ధతీసుకున్న ఎంఈవో నాగేశ్వర్‌రావు నాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం సంజీవకుమార్ నాయక్, ఇక్కడ గ్రామంలో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుడికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


విద్యార్థులతో ఉపాధ్యాడు వెంకటేశ్వర్లు

ప్రైవేటుకు దీటుగా మార్చేసారు


ఇంటింటి ప్రచారం చేస్తున్న డి.రాజేందర్‌రెడ్డి(ఫైల్)

డిండి : పట్టు వీడని విక్రమార్కుడిలా తనతోపాటు తెలిసిన మిత్రుల ఆర్థిక సహకారంతో పాఠశాలను దిన దినాభివృద్ధి చేస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచి ఆదర్శంగా నిలుస్తున్నారు మండల పరిధిలోని తవక్లాపూర్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం దెండి రాజేందర్‌రెడ్డి. ఆయన పాఠశాల అభివృద్ధిలో భాగంగా తరగతి గదులు, ప్రహరీలపై వివిధ రంగులతో మెరిసే స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలతోపాటు మంచి నీటి సౌకర్యం, టాయిలెట్స్ వంటి మౌలిక వసతులు, ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణాన్నిచ్చే పచ్చని చెట్లు ఏర్పాటు చేశారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలంటూ చేసిన ఇంటింటి ప్రచారంతో తమ పిల్లలను తవక్లాపూర్ ప్రభుత్వ బడికే పంపిస్తామంటూ పలు తండాల్లోని ప్రజలు తీర్మానాలు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. ప్రతి ఏటా పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులందరికీ బ్యాగులు, స్టడీ మెటీరియల్, షూ కూడా ఉచితంగా అందిస్తూ మంచి గుర్తింపు పొందారు. ఈ క్రమంలో పలు సందర్భాల్లో మండల, జిల్లాస్థాయిలో అవార్డులు, ప్రశంస పత్రాలను అందుకున్నారు.

జంతు సంరక్షణకు కేంద్రం ఏర్పాటు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: అన్ని రకాల జంతువుల సంరక్షణకు మిర్యాలగూడ పట్టణ సమీపంలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. గురువారం మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం వద్ద సుమారు రూ.60లక్షలతో రెండు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల చిన్నారులపై వీధి కుక్కల దాడులు ఎక్కువయ్యాయని, వాటి జనన నియంత్రణకు ఎన్‌జీఓతో ఒప్పందం చేసుకుని మిర్యాలగూడలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశం ఏర్పాటుచేశారు. అలాగే పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వంద సీసీ కెమెరాలకు సంబంధించి కమాండ్ కంట్రోల్‌ను ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి ప్రారంభించారు. పట్టణ వ్యాపార సముదాయాల యజమానులు మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.10లక్షలను అందించగా వారిని అభినందించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అవిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సీఐలు రామనర్సయ్య, నాగభూషణ్, పీఎస్‌డీ.ప్రసాద్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థల పరిశీలన

నిడమనూరు : మండలంలోని ఊట్కూరులో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం పరిశీలించారు. సర్వే నెంబరు 358, 361లో దాదాపు 15 ఎకాలకు వరకు ప్రభుత్వ భూమి ఉండడంతో అక్కడ స్కూల్‌ఏర్పాటు సాధ్య సాధ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ భూమి వివరాలను తహసీల్దారు జంగాల కృష్ణయ్య కలెక్టరు ఇలా త్రిపాఠికి వివరించారు. ఆమె వెంట కలెక్టర్ పర్యటనలో అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం తహసీల్దార్ కృష్ణయ్య, డివిజన్ సర్వేయర్ విజయ్, సర్వేయర్ల బృందం, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం ఉన్నారు.

చందంపేట సమగ్రాభివృద్ధికి కృషి


పొగిళ్లలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట : చందంపేట మండల సమగ్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం మండలంలోని పొగిళ్ల గ్రామంలో రూ.3.50 కోట్ల వ్యయంతో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణాలు చేపడితే వారి వారి ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలో పల్లె దవాఖానాను ప్రారంభించారు. కంబాలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఇంటి మంజూరు పత్రాలను అందజేశారు. తర్వాత పాత కంబాలపల్లి, ఉస్మాన్‌కుంట, బొల్లారం గ్రామాల్లో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పాత తెల్దేవర్‌పల్లిలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. పొగిళ్ల గ్రామంలో ఆన్‌లైన్‌లో నమోదు కాని భూమి తాలుకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్యానాయక్, మాజీ ఎంపీపీలు గోవిందుయాదవ్, సర్వయ్య, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్, ముక్కమల వెంకటయ్యగౌడ్, లింగాల వెంకటయ్యగౌడ్, మాజీ సర్పంచ్‌రవినాయక్, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్, మెటెల్లి, మల్లారెడ్డి, అనంతగిరి, రాంసింగ్, సాధిక్, కొండల్, మున్నయ్య, ఎంపీడీఓ లక్ష్మి, ట్రాన్స్‌కో ఏడీ సైదులు, డీఈ విద్యాసాగర్, పీఆర్‌ఏఈ రాజునాయక్, అధికారులు, సీఐ బీసన్న, ఎస్ఐ పాల్గొన్నారు.

గుడిసెలు తొలగించొద్దని ధర్నా


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

పెద్దవూర : గత పదేళ్లుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న తమ గుడిసెలు తొలగిస్తున్నారని మండలంలోని పోతునూరు గ్రామానికి చెందిన దళితులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం మిర్యాలగూడెం సబ్ కలెక్టర్, డీఎస్పీలు వచ్చినట్లు తెలిపారు. గుడిసెలు వేసుకున్న వారితో మాట్లాడి విచారణ చేసి మీ వద్ద ఎలాంటి ఆధారాలు ఉన్నాయో తీసుకుని గురువారం పెద్దవూర తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి మాట్లాడుకోవాలని సూచించినట్లు తెలిపారు. దీంతో గ్రామానికి చెందిన 50మందికి పైగా దళితులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్‌తో మాట్లాడినట్లు తెలిపారు. తహసీల్దార్ మీరు గుడిసెలు వేసుకున్నది అసైన్డ్ భూమి కాదని, పట్టా భూమి అని పేర్కొన్నట్లు తెలిపారు. దీంతో తహసీల్దార్ కార్యాలయం ముందు తమకు న్యాయం చేయాలని ధర్నా చేశారు. నాయకుల ప్రోద్బలంతో అధికారులు గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసైన్డ్ భూమిలోనే గుడిసెలు వేసుకుని జీవిస్తున్నామని, తమకు పట్టాలు ఇచ్చి 70దళిత కుటుంబాలను ఆదుకోవాలని విన్నవించినట్లు తెలిపారు. న్యాయం కోసం ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వెళ్తామని పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్ శాంతిలాల్‌ను వివరణ కోరగా గుడిసెలు వేసుకున్న స్థలం అసైన్డ్ భూమి అని పేర్కొంటున్నారని, వారివద్ద ఉన్న ఆధారాలు తీసుకుని రావాలని చెప్పినట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు తీసుకురాలేదని అయినప్పటికీ తమ వద్ద ఉన్న పహణీల రికార్డులలో పట్టా భూమి అని ఉన్నట్లు చూపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్ మహరాజ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవి, నాయకులు శ్రీను, మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బాపూజీనగర్‌లో నూతన రేషన్ షాపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. రేషన్ డీలర్లు సామాజిక బాధ్యతతో పనిచేస్తూ ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యం అందించాలన్నారు. పేదలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఫ్రీ బస్సు వంటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో పనిచేయాలి

వేములపల్లి : రేషన్ డీలర్స్ సామాజిక బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో నూతన రేషన్ షాపును ఆయన ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది కాలంలోనే పేద ప్రజల కోసం 200యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్‌కార్డులు, సన్నబియ్యం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందించి ప్రభుత్వం పేద ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలని కార్మికుల నిరసన

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీ నాట్కో ఫార్మా కంపెనీకి చెందిన కార్మికులు సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తమను పర్మినెంట్ చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా నాట్కో ఫార్మా కంపెనీలో క్యాజువల్ కార్మికులుగా పనులు చేస్తున్నామని తెలిపారు. దశాబ్ద కాలంగా తమను పర్మినెంట్ చేయాలని కంపెనీ యాజమాన్యాన్ని కోరుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తూ క్యాజువల్ కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, రంగా, నాగు, అంజయ్య, అమీర్, ముని, బాలాజీ, రమేష్, శాంతి, కమల, రిభిక, దేవి, లీల, మంగ తదితరులు పాల్గొన్నారు.

రైతులను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : యూరియా కొరత లేకున్నప్పటికీ ఉందంటూ రైతులను బీఆర్‌ఎస్ పార్టీ తప్పుదోవ పట్టిస్తుందని మండల కాంగ్రెస్ నాయకులు గుండు నరేందర్ ఆరోపించారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీలో తలెత్తున్న సమస్యలు ప్రజల దృష్టికి రాకుండా ఉండేందుకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు యూరియా కొరత ఉందంటూ ఆందోళనలు చేయించడం బీఆర్‌ఎస్ పార్టీకి తగదన్నారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చొరవతో నియోజకవర్గానికి 320మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారంను మానుకోవాలన్నారు.

యూరియా కొరతకు ప్రభుత్వాలే కారణం


రైతులతో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పీఏసీఎస్ కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులు పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. రైతులకు అవసరమైన యూరియాను తెప్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ముందుగా ప్రణాళిక వేసుకోకపోవడం, ఆ మేరకు యూరియాను తెప్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆయకట్టులో వరి పంట సాగు చేసుకొని నెలరోజులు దాటిందని ఇప్పటివరకు రెండు సార్లు యూరియా చల్లాల్సి ఉన్నప్పటికీ ఒక్కసారి కూడా చల్లలేదన్నారు. రైతులు నాటు వేసే నాటి నుంచి పంట అమ్ముకునేంతవరకు రైతులు పోరాటాలు చేయాల్సి వస్తుందన్నారు. తక్షణమే రైతులకు అవసరమైన యూరియాను తెప్పించి రైతులకు సకాలంలో అందించాలని లేనట్లయితే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, బావండ్ల పాండు, నాగేశ్వర్‌రావు నాయక్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌నగర్‌ను సందర్శించిన యూపీ అధికారులు


శ్రీనివాస్‌నగర్‌లోని పల్లె ప్రకృతి వనం వద్ద యూపీ అధికారులు

మిర్యాలగూడ: బాలల స్నేహ పూర్వక గ్రామ పంచాయతీ అనే థీమ్‌పై ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పంచాయతీరాజ్ శాఖ ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం, ఐటీఐఆర్డీ ఫ్యాకల్టీ గురువారం మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్‌నగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, గ్రామపంచాయతీ భవనం, పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్ షెడ్, వైకుంఠధామాన్ని పరిశీలించారు. బాలల స్నేహ పూర్వ గ్రామపంచాయతీ థీమ్ విభాగంలో 2021–22 సంవత్సరానికి రాష్ట్ర స్థాయిలో బహుమతి గెలుచుకోవడానికి గ్రామపంచాయతీలో చేసిన లక్ష్య సాధన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట డీపీఓ రాఘవరావు, మండల ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఎంపీఓ రమేష్, ఏపీఓ కళావతి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం రోజంతా క్యూలైన్‌లోనే..


మాడ్గులపల్లి : రాస్తారోకో చేస్తున్న రైతులు


త్రిపురారం పీఏసీఎస్ ముందు బారులుదీరిన రైతులు

మిర్యాలగూడ : నాట్లు వేసుకోని సుమారు నెల రోజులైనా ప్రభుత్వం రైతులకు సకాలంలో సరిపడా యూరియా అందించకపోవడంతో ఆగ్రహించిన మిర్యాలగూడ మండలం తుంగపాడు రైతులు కోదాడ– జడ్చర్ల రోడ్డుపై కంప వేసి ఆందోళన చేపట్టారు. నాటు వేసిన 15రోజులకు యూరియా వేస్తేనే వరికి అధిక పిలకలు వచ్చి దిగుబడులు వస్తాయని, ఈ సమయంలో తమకు యూరియా అందకపోవడంతో అధిక పిలకలు రావని దీంతో దిగుబడిపై ప్రభావం పడి తాము తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు, వ్యవసాయాధికారులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

మాడుగులపల్లి : రైతులకు సకాలంలో సరిపడా యూరియా అందించడంలో ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ మండల రైతులు గురువారం మండల కేంద్రంలోని అద్దంకి– నార్కట్‌పల్లి రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. 200 బస్తాల యూరియా రాగా అధికారులు ఒక్కొక్కరికి ఒక బస్తా యూరియా అందించగా ఇంకా అనేక మందికి యూరియా రాకపోవడంతో చేసేదేమి లేక తాము రోడ్డెకాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు, వ్యవసాయాధికారులు అక్కడికి చేరుకోని రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.

నిడమనూరు : యూరియా కోసం రైతులు రోజంతా క్యూలైనులోనే నిలబడ్డారు. గురువారం రోజు నిడమనూరు సహకార సంఘానికి 40టన్నులు యూరియా 888 బస్తాల(45కేజీలు) యూరియా రాగా, 444 మంది రైతులు పంపిణీ చేశారు. రైతుల రద్దీ, ఆందోళనతో లారీల్లోంచే నేరుగా నగదు చెల్లించి, రశీదు పొందిన రైతులకు అందజేశారు. కుటుంబ సభ్యులందురూ మూడు రోజులు క్యూలైనులో నిలబడితే. మూడో వంతు రైతులకు కూడా యూరియా దొరకని పరిస్థితి,దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో రైతులకు యూరియా కష్టాలు రోజు రోజుకు ఎక్కువ అవుతున్నాయి. గురువారం త్రిపురారం పీఏసీఎస్‌కు యూరియా వస్తుందని ఉదయం 5గంటల నుంచి వివిధ గ్రామాల నుంచి రైతులు వచ్చి వరుసలో నిలబడ్డారు. పోలీసుల పర్యవేక్షణలో 440 యూరియా బస్తాలు ఆధార్ కార్డుకు 2 బస్తాల చొప్పున పంపిణీ చేశారు. చివరి రైతులు నిరాశగా వెనుదిరిగారు. పెద్ద దేవుల పల్లికి చెందిన 150మంది రైతులు మండల కేంద్రానికి చేరుకొని సాగర్ రోడ్డుపై ధర్నా చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని సంబంధిత పీఏసీఎస్ నిర్వాహకులతో మాట్లాడి రైతులతో ధర్నా విరమింపజేశారు.


మిర్యాలగూడ : తుంగపాడులో సాగర్ రోడ్డుపై కంప వేసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

గుర్రంపోడు : యూరియా కోసం రైతులు మళ్లీ రోడ్డెక్కారు. గురువారం మండలకేంద్రంలోని ఎరువుల దుకాణానికి యూరియా వస్తుందన్న సమాచారంతో చేరుకున్న రైతులు టోకెన్లు మాత్రమే ఇస్తామన్నారు. అంతేగాక రైతుకు ఒక్క బస్తా మాత్రమే ఇస్తారనడంతో రాస్తారోకో చేశారు. ఎస్ఐ పసుపులేటి మధు రైతులకు నచ్చజెప్పడంతో శాంతించారు.